తెలంగాణ

TELANGANA MUCHATLU



# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం - 21 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 167 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్‌కు చెందిన ప్రాంతాల్లో

## ఈడీ సోదాలు

- రూ.40.96 కోట్ల సీఎంఆర్ ధాన్యం కొరత కేసులో తనిఖీలు
- ఖానాపూర్ నివాసం, సత్తెనపల్లిలోని రైస్ మిల్లులో సోదాలు
- మనీలాండరింగ్ కోణంలో ఆర్థిక లావాదేవీల పరిశీలన

**నిర్మల్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

రూ.40.96 కోట్ల విలువైన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం కొరత వ్యవహారంలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్‌కు చెందిన ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్‌లో ఆమె నివాసంతోపాటు, సత్తెనపల్లి గ్రామంలోని ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆధారాల సేకరణపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. రేఖా నాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ మిల్లులో 202223, 202324, 202425 రబీ సీజన్లలో ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి సంబంధించి కొరత ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ తనిఖీల్లో గుర్తించింది. మొత్తం 9,639.962 మెట్రిక్ టన్నుల ధాన్యం లెక్కల్లో తేలకపోవడంతో ప్రభుత్వానికి సుమారు రూ.40.96 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా, అవసరమైన పరిమాణంలో బియ్యం సరఫరా కాలేదన్నది

మిగతా 2 లో..

# జనాభాతో పాటు రాష్ట్రాల ఆర్థిక ప్రగతినీ పరిగణనలోకి తీసుకోవాలి

- లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్ అభిప్రాయం
- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భంగం కలగకూడదని స్పష్టీకరణ
- 'తెలంగాణ రైజింగ్ 2047'తో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక
- విద్య, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులకు ప్రాధాన్యత




**నిర్మల్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా, రాష్ట్రాల ఆర్థిక ప్రగతికి కూడా సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్-2026' మీడియా కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన పునర్విభజన, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, దేశాభివృద్ధి నమూనా, తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. జనాభా ఆధారంగా మాత్రమే లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక స్థానాలు దక్కితే దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం తగ్గి, కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా ప్రభావం పడే పరిస్థితి వస్తుందని అభిప్రాయపడ్డారు. అందువల్ల రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ), జనాభా రెండింటినీ పరిగణనలోకి తీసుకుని పునర్విభజన చేపట్టాలని సూచించారు. దేశాభివృద్ధిలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించిన విధానాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ప్రతి పేదవాడి అభ్యున్నతే నిజమైన అభివృద్ధి అని మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వసించారని గుర్తుచేశారు. నెహ్రూ హయాంలో విద్యాసంస్థలు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత లభించిందని తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను మన్మోహన్ సింగ్ కొనసాగించారని పేర్కొంటూ, పేదల సంక్షేమం, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ పార్టీ అభివృద్ధి నమూనా అని వివరించారు.

తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను రూపొందించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గత మూడేళ్లలో తమ ప్రభుత్వం నిర్దేశించుకున్న కార్యక్రమాల్లో 65 శాతం అమలు చేశామని, మిగిలిన వాటిని వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని వెల్లడించారు. పెట్టుబడులకు విస్తృత అవకాశాలు కల్పిస్తూ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని, డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే

మిగతా 2 లో..




## చుక్కా రామయ్యకు సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

- శతవసంతాలు పూర్తి చేసుకున్న ప్రముఖ విద్యావేత్త
- విద్యా రంగానికి ఆయన సేవలు చిరస్మరణీయం
- ఆయన ఆలోచనలు, సూచనలతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య శతవసంతాలు పూర్తి చేసుకుని కొత్త వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చుక్కా రామయ్య జన్మదినం తెలంగాణ ప్రజలకు, విద్యా వ్యవస్థకు గొప్ప పర్వదినమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. విద్యా రంగానికి ఆయన అందించిన సేవలు, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ ఉద్యమంలో చుక్కా రామయ్య క్రియాశీలక పాత్ర పోషించారని సీఎం గుర్తుచేశారు. ఐఐటీ అనే పదాన్ని సామాన్య ప్రజలకు, విద్యార్థులకు పరిచయం చేసిన గొప్ప విద్యావేత్తగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని కొనియాడారు. విద్యా రంగంలోనే కాకుండా శాసనమండలి

మిగతా 2 లో..



## జెనీవా 1ఎం1బి సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు

- పదో అంతర్జాతీయ ప్రభావ సదస్సుకు హాజరు
- కృత్రిమ మేధ, ఆవిష్కరణలపై చర్చలు
- వాతావరణ మార్పులపై అంతర్జాతీయ భాగస్వామ్యం
- తెలంగాణ యువతకు కొత్త అవకాశాలే లక్ష్యం

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో నిర్వహిస్తున్న పదో 1ఎం1బి ప్రభావ సదస్సుకు తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. యువ మార్పు సాధకులు, అంతర్జాతీయ పరిశ్రమల ప్రముఖులు, వివిధ దేశాలకు చెందిన సంస్థల ప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చే ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సాంకేతిక, సామాజిక పరిణామాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. కృత్రిమ మేధ, సాంకేతిక ఆవిష్కరణలు, వాతావరణ మార్పులపై తీసుకోవాల్సిన చర్యలు భవిష్యత్తును ఎలా ప్రభావితం చేయగలవన్న అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో మార్పు కోసం కృషి చేస్తున్న యువత, పరిశ్రమల నాయకులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధుల అనుభవాలు, ఆలోచనలు ఈ వేదిక ద్వారా పంచుకునే అవకాశం ఉంటుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

మిగతా 2 లో..

## రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ తీవ్ర విమర్శలు

- పాలమూరు ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి
- నీటి లభ్యత ఉన్నా వినియోగించుకోవడం లేదని ఆరోపణ
- శంకరమ్మకు ఎమ్మెల్సీ ఇవ్వాలని రేవంత్‌కు సవాల్
- అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే ఆధారాలతో నిరూపిస్తానని వెల్లడి



**మహబూబ్‌నగర్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీ వేదికగా ఆధారాలతో సహా నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి తనకు మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు నీటి విషయంలో ప్రభుత్వం

మిగతా 2 లో..



## ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా భరోసా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం
- నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 18–59 ఏళ్ల అర్హులైన సంపాదనపరులకు పథకం వర్తింపు
- ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి పొన్నం వెల్లడి

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పథకం నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో ఈ పథకాన్ని అమలు చేస్తోందని పొన్నం ప్రభాకర్ వివరించారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న సంపాదనపరుడు మరణిస్తే, ఆ కుటుంబం ఆర్థికంగా

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## జనాభాతో పాటు రాష్ట్రాల ఆర్థిక ప్రగతినీ
# పరిగణనలోకి తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు అంతర్జాతీయ పెట్టుబడిదారులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

విద్యారంగంలోనూ పలు సంస్కరణలు చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటైన విద్య అందించడమే లక్ష్యమని, రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలతో విద్యార్థుల హాజరు పెరిగిందని చెప్పారు. పదో తరగతి తర్వాత కళాశాలలు దూరంగా ఉండటంతో చదువుకు దూరమవుతున్న విద్యార్థుల సమస్యను పరిష్కరించేందుకు ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్య పరిధిలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ఐటీఐలను ఆధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయని కూడా తెలిపారు.

క్రీడారంగ అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ద్వారా సుమారు 8 వేల మంది క్రీడాకారులకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని ఇప్పటికే తెలంగాణకు తీసుకువచ్చామని, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. మెస్సీ తన అభిమాన క్రీడాకారుడని, గతంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం మారడోనా కూడా తనకు ఇష్టమైన ఆటగాడని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య, ఉపాధి, పెట్టుబడులు, క్రీడలు వంటి రంగాల్లో సమగ్ర ప్రణాళికతో తెలంగాణను ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

## చుక్కా రామయ్యకు సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుడిగా కూడా ప్రజా సమస్యలపై తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు. విద్య, సామాజిక అభివృద్ధి అంశాలపై ఆయన చేసిన కృషి ఎంతో విలువైనదని పేర్కొన్నారు.

చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి ప్రముఖులతో కలిసి పనిచేసిన అనుభవాన్ని సీఎం ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. వారితో కలిసి పనిచేయడాన్ని గొప్ప విషయంగా, అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. శాసనమండలిలో సామాజిక, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే కాకుండా వాటి పరిష్కారానికి విలువైన సూచనలు చేసేవారని చెప్పారు. ప్రజల సమస్యలపై నిర్మాణాత్మకంగా ప్రశ్నిస్తూ పాలనలో మార్పులకు దోహదపడేవారని కొనియాడారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో డిగ్రీ కళాశాల లేకపోయిన విషయాన్ని చుక్కా రామయ్య శాసనమండలిలో ప్రస్తావించే వరకు చాలామందికి తెలియదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆయన ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తర్వాత సంబంధిత నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వాన్ని కదిలించే సామర్థ్యం ఆయనకు ఉందని పేర్కొన్నారు. చుక్కా రామయ్య ఆలోచనలు, సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కాలానికి, రాజకీయాలకు అతీతమైన వ్యక్తిత్వం చుక్కా రామయ్యదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరింతకాలం జీవిస్తూ సమాజానికి, విద్యార్థులకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి తదితర ప్రముఖులు చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

అన్యాయం చేస్తోందని, సాగునీటిని వినియోగించుకునే అవకాశాలున్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ, ప్రజలు ఓట్ల ద్వారా తగిన సమాధానం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. పాలమూరు ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ, చంద్రబాబు పాలనలో అన్యాయం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. మూడు దశాబ్దాల పాటు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసి నీటి పారుదల ప్రాజెక్టులుగా ముందుకు తీసుకెళ్లిందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.4 వేల కోట్లు ఖర్చు చేసి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. పాలమూరు ప్రాంత రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని గుర్తించాలని కోరారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. గత మూడేళ్లుగా కనీసం అరకిలోమీటరు కాలువ కూడా తవ్వలేదని ఆరోపించారు. 50 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం దానిని వినియోగించుకోలేకపోయిందని అన్నారు. రైతులకు సాగునీరు అందించాల్సిన సమయంలో నీటి కొరత సృష్టించి పంట విరామం ప్రకటించే పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. నీళ్లు అందించకుండా క్రాప్ holiడే ప్రకటించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన చరిత్ర తమదని, ద్రోహులకు పాల్పడిన చరిత్ర కాంగ్రెస్‌దని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన శంకరమ్మకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఆమెకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఓడించిందని ఆరోపించారు. సిద్దిపేట కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను ఆ పార్టీ నాయకులు పట్టించుకోలేదని, అయితే బీఆర్ఎస్ తరఫున ఆయనకు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయించామని తెలిపారు. ముత్యం రెడ్డి వేరే పార్టీలో ఉన్నప్పటికీ క్యాన్సర్ చికిత్స కోసం రూ.2 కోట్లు ఇచ్చి అమెరికాకు పంపించిన మానవతావాది కేసీఆర్ అని కొనియాడారు.

రేవంత్ రెడ్డిపై మరిన్ని తీవ్ర వ్యాఖ్యలు చేసిన హరీశ్ రావు, చంద్రబాబు జలదోపిడీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శిస్తూ ఆయనపై వ్యక్తిగత దూషణలకు దిగారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని, సాగునీటి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో తనకు అవకాశం కల్పిస్తే నీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ నిర్ణయాలు, రైతులకు జరిగిన నష్టంపై పూర్తి వివరాలతో మాట్లాడతానని స్పష్టం చేశారు. అయితే ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందనను సంబంధిత వర్గాలు వెల్లడించాల్సి ఉంది.

## పెద్దమ్మ తల్లి బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎంపీ





- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ
- భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు
- బీజేపీ జిల్లా, రాష్ట్ర నాయకుల హాజరు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

**మేడ్చల్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ గంగాధర్‌పల్లిలో నిర్వహించిన శ్రీశ్రీ పెద్దమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గంగాధర్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, గోపు రమణ రెడ్డి, తిరుపతి యాదవ్ పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్ రెడ్డితో పాటు సీనియర్ నాయకులు బొట్టు గిరి, శ్రీకాంత్ రెడ్డి, మహేష్ తదితరులు హాజరయ్యారు. ఈటల రాజేందర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలను పలకరించారు. గ్రామంలో కొనసాగుతున్న బోనాల వేడుకల వివరాలను తెలుసుకున్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సంప్రదాయ ఆచారాలతో నిర్వహించిన బోనాల పండుగ వేడుకలు గంగాధర్‌పల్లిలో ఆధ్యాత్మిక సందడిని నింపాయి.

## జెనీవా 1ఎం1బి సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ తరఫున అంతర్జాతీయ సమాజంతో మమేకం కావడం వల్ల కొత్త ఆలోచనలను తెలుసుకోవడంతో పాటు వివిధ దేశాలు, సంస్థలతో అర్థవంతమైన భాగస్వామ్యాలను నిర్మించుకోవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచస్థాయి పరిణామాలను రాష్ట్ర అభివృద్ధికి అనుసంధానించడం, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడం ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చని తెలిపారు.

ఆవిష్కరణలను కేవలం ఆలోచనలకే రిమితం చేయకుండా, వాటిని సమాజానికి ఉపయోగపడే ఫలితాలుగా మార్చడం కీలకమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చే సుస్థిర భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రపంచ దేశాల అనుభవాలు, నూతన విధానాలు తెలంగాణకు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సులో జరిగే చర్చలు, అంతర్జాతీయ ప్రతినిధులతో పరస్పర అభిప్రాయాల మార్పిడి ద్వారా రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు కల్పించే మార్గాలను అన్వేషించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కృత్రిమ మేధ, ఆవిష్కరణలు, వాతావరణ కార్యాచరణ వంటి రంగాల్లో ప్రపంచస్థాయి పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తెలంగాణ అభివృద్ధికి దోహదపడే భాగస్వామ్యాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్‌కు చెందిన ప్రాంతాల్లో
# ఈడీ సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంపై పౌరసరఫరాల శాఖ ఫిర్యాదు ఆధారంగా ఖానాపూర్ పోలీసులు గతంలోనే కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని 316(2), 316(5), 318(4) సెక్షన్లతోపాటు నిత్యావసర సరుకుల చట్టంలోని నిబంధనల కింద దర్యాప్తు చేపట్టారు. ఈ పోలీసు కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో విచారణ ప్రారంభించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

సోదాల్లో భాగంగా ధాన్యం కేటాయింపులు, మిల్లింగ్ వివరాలు, బియ్యం సరఫరాకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. అనుమానిత అక్రమ ఆదాయం ఎక్కడికి మళ్లింది, దాని ద్వారా ఆస్తులు కొనుగోలు చేశారా అనే అంశాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈడీ తనిఖీల సందర్భంగా సుమారు రూ.30 లక్షల నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు పీటీఐ వార్తా సంస్థ వెల్లడించింది. అయితే ఆ నగదు ఏ ప్రాంతంలో లభించిందనే వివరాలు స్పష్టంగా తెలియరాలేదు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన ధాన్యం లెక్కల్లో తేడాలు ఉన్నాయన్న ఆరోపణలపై కొనసాగుతున్న ఈ దర్యాప్తులో ఈడీ సేకరించిన పత్రాలు, ఆర్థిక లావాదేవీల వివరాలు కీలకంగా మారనున్నాయి. సోదాలు, విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో రేఖా నాయక్‌పై వచ్చిన ఆరోపణలు ఇంకా దర్యాప్తు పరిధిలోనే ఉన్నాయి; తుది నేర నిర్ధారణ జరగాల్సి ఉంది.

## ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా భరోసా

(మొదటి పేజీ తరువాయి)

కుంగిపోకుండా రూ.5 లక్షల బీమా పరిహారం అందించడమే ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అనుకోని ఆపద సమయంలో కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలిచేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.

18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన సంపాదనపరులకు ఈ బీమా పథకం వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. బీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని, లబ్ధిదారులు తమ సొంత డబ్బుతో ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పొన్నం వివరించారు. ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, పుస్తకాలు, బూట్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లు, 15 శాసనసభ నియోజకవర్గాల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కేవలం బీమా సదుపాయం మాత్రమే కాదని, కష్టకాలంలో ప్రభుత్వం కుటుంబాలకు అండగా ఉంటుందనే భరోసా అని పేర్కొన్నారు. అర్హులైన వారంతా నిర్ణీత గడువులోగా నమోదు చేసుకోవాలని పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

## రేవంత్ రెడ్డి సిద్ధిపేట సభతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- అభివృద్ధి ప్రకటనలు లేకుండా ముగిసిన సీఎం పర్యటన
- వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యత ఇచ్చారన్న కొత్త ప్రభాకర్ రెడ్డి
- ప్రజాధనం ఖర్చు చేసి రాజకీయ ప్రసంగాలు చేయడం సరికాదని వ్యాఖ్య



**సిద్ధిపేట, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటనలో ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టమైన ప్రకటనలు చేయకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యత ఇచ్చారని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. భారీ హంగామా, కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని వ్యాఖ్యానించారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెరు ప్రతాప్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గత పది రోజులుగా భారీ ప్రచారం నిర్వహించారని, లక్షలాది మంది ప్రజలు హాజరవుతారని చెప్పి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారని కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు, పోలీసు బలగాలను సిద్ధిపేటకు తరలించి భారీ హడావుడి చేశారని విమర్శించారు. ఇంతటి ఆర్భాటం చూసి జిల్లాకు గొప్ప ప్రాజెక్టులు, భారీ నిధులు ప్రకటిస్తారని ప్రజలు ఆశించారని, కానీ చివరకు అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రకటనలు లేకుండానే సభ ముగిసిందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడల్లా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమై ప్రజల సమస్యలను తెలుసుకునేవారని ఆయన గుర్తుచేశారు. విద్యుత్, సాగునీరు, రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేసేవారని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి మాత్రం ఎక్కడ పర్యటించినా కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్‌లను విమర్శించడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల ముందుకు రావాల్సిన ప్రభుత్వం వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు.

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మాట్లాడే మాటల్లో హుందాతనం ఉండాలని కొత్త ప్రభాకర్ రెడ్డి హితవు పలికారు. వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలతో ముఖ్యమంత్రి పదవి గౌరవాన్ని తగ్గించవద్దని సూచించారు. కేసీఆర్ కుటుంబంపై ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణ ప్రజల్లో ఆయనకున్న స్థానాన్ని చెరపలేరని వ్యాఖ్యానించారు. ప్రజాధనాన్ని ఖర్చు చేసి ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధిపేటకు తరలించడం వల్ల ప్రజలకు ఏం ప్రయోజనం కలిగిందని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ రాజకీయ సభలుగా మార్చుకోవడం తగదని, రాజకీయ విమర్శలు చేయాలనుకుంటే పార్టీ ఖర్చులతో సభలు నిర్వహించుకోవాలని సూచించారు.


తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శనివారం - 21 - నవంబర్ 2026
వరంగల్ 03

# సీఎంఆర్ఎఫ్ సాయంతో పేద కుటుంబాలకు ఊరట



- **లబ్ధిదారులకు రూ.3.24 లక్షల ఆర్థిక సాయం చెక్కులు అందజేసిన ముప్వా.**

**సత్తుపల్లి, నవంబరు 20 (తెలంగాణ ముచ్చట్లు):** నియోజకవర్గంలోని సత్తుపల్లి పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మాజీ టీజీఐఐసీ చైర్మన్ ముప్వా విజయబాబు అందజేశారు. సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేటకు చెందిన తడికి ముల్ల అప్పారావుకు రూ.22,500, సిద్ధారం గ్రామానికి చెందిన స్వర్గీయ నల్లంటి బసవయ్యకు రూ.45,000, అదే గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనుకు రూ.20,000, సత్తుపల్లి సిద్ధారం రోడ్డుకు చెందిన లింగాల వెంకట రమేష్‌కు రూ.2 లక్షలు, బేతుపల్లి గ్రామానికి చెందిన ఓరుగంటి చందర్రావుకు రూ.36,500 చొప్పున ఆర్థిక సాయం అందింది. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ టీజీఐఐసీ చైర్మన్ ముప్వా విజయబాబులకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బేతుపల్లి సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు), కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, ముప్వా అభిమానులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ కుటుంబ బీమాతో ప్రతి ఇంటికి ఆర్థిక భద్రత

- **అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు**
- **ముల్కనూర్‌లో అవగాహన, అమలు చర్యలు**

**భీమదేవరపల్లి, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గం, భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఈ పథకం అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు గ్రామంలోని అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించేలా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన కుటుంబ యజమానులకు జీవిత బీమా రక్షణ లభించనుంది. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ఆపద ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

ఈ కార్యక్రమంలో ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉపసర్పంచ్ కసుగోని మమత బాలకృష్ణ, భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, మండల ఎంపీడీవో వీరేశం పాల్గొన్నారు.వీరితో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**పెద్దమందడి,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో నిర్వహించిన వివాహ వేడుకకు హాజరయ్యారు.గ్రామానికి చెందిన బోయిని అలివేలమ్మ, బోయిన్ చిన్నయ్య దంపతుల కుమారుడు రాఘవేందర్ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, మార్కెట్ యాడ్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామ గ్రామ సర్పంచ్ మాధవి వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డిఎస్ మహేష్, బాలు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ.!

- **కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ఆర్థిక భరోసా.**

**సత్తుపల్లి, నవంబరు 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం గొప్ప సంక్షేమ కార్యక్రమమని పేర్కొన్నారు. శుక్రవారం సత్తుపల్లి మున్సిపాలిటీ 14వ వార్డు, పెనుబల్లి మండలం బయన్నగూడెంలో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అనుకోని ప్రమాదాలు, కుటుంబ సభ్యుల మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ఈ పథకం అండగా నిలుస్తుందన్నారు.కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భాల్లో బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, భవిష్యత్తుకు భద్రత కల్పించడమే దీని ఉద్దేశమని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం బీమా పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు, మొబైల్ నంబర్ తదితర వివరాలను సిద్ధం చేసుకుని సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. నవంబర్ 19 నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి భద్రత, ప్రతి పౌరుడికి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చల్లగుళ్ల నరసింహారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం, మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, పెనుబల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, ఎంఆర్ఓ, ఎంపీఓ, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీమా కాదు.. బతకడానికి ఇల్లు కావాలి!

# పేదల ప్రశ్నలకు సమాధానం చెప్పేదెవరు?

**ఎల్కతుర్తి నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సామాన్య పేద ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉండడానికి సొంత ఇల్లు లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ తమకు ఇప్పటికీ ఇళ్లు మంజూరు కావడం లేదని వాపోతున్నారు. ఒకవైపు ఇందిరమ్మ బీమా పథకం తీసుకొస్తుండగా, మరోవైపు ఇల్లు లేని పేదల పరిస్థితి మాత్రం అలాగే ఉందని ప్రశ్నిస్తున్నారు.

**బీమా పథకం మంచిదే.. కానీ ఇల్లు లేని పేదల సంగతేంటి?**

ప్రభుత్వం తీసుకొస్తున్న ఇందిరమ్మ బీమా పథకాన్ని తాము వ్యతిరేకించడం లేదని, పేద కుటుంబాలకు బీమా భరోసా కల్పించడం మంచి నిర్ణయమేనని ప్రజలు అంటున్నారు. అయితే బీమా పథకంతో పాటు సొంత ఇల్లు లేని నిరుపేదల సమస్యను కూడా ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు. బీమా వద్దనడం లేదని, తమకు కావాల్సింది కూడా ఆర్థిక భద్రతేనని, కానీ ముందుగా ఉండడానికి ఒక గూడు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఒకవైపు బీమా ప్రకటనలు.. మరోవైపు పూరిగుడిసెల్లో పేదల బతుకులు!**

"మాకు బీమా పథకం వద్దని చెప్పడం లేదు.. అది కూడా పేదలకు ఉపయోగపడే పథకమే. కానీ మాకు ఉండడానికి ఇల్లు లేదు. వర్షం వస్తే ఇల్లు కురుస్తుంది.. ఎండ వస్తే నిలువ నీడ ఉండదు. ఎన్నిసార్లు ఇందిరమ్మ ఇల్లు కావాలని అడిగినా మాకు ఇల్లు మంజూరు కావడం లేదు. ఒకవైపు బీమా పథకం తీసుకొస్తున్నారు.. మరోవైపు మేము మాత్రం పూరిగుడిసెల్లోనే బతుకుతున్నాం. మా పరిస్థితి ఎప్పుడు మారుతుంది?" అంటూ సామాన్య పేద ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు అద్దె ఇళ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరికొన్ని కుటుంబాలు శిథిలావస్థకు చేరిన గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నాయి. ఎన్నికల సమయంలో సొంతింటి కల నెరవేరుతుందని ఆశించామని, ఇప్పటికైనా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.


**పేదవాడికి బీమా భరోసాతో పాటు సొంతింటి భరోసా ఎప్పుడు?**

"మా పిల్లలు సొంతింట్లో ప్రశాంతంగా ఉండే రోజులు ఎప్పుడు వస్తాయి? బీమా పథకం మంచిదే.. దాన్ని మేము వద్దనడం లేదు. కానీ ఇల్లు లేని పేదవాడి బాధను కూడా ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. మాకు హామీలు కాదు.. ఆచరణలో ఇళ్లు కావాలి" అంటూ ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిజమైన నిరుపేదలను గుర్తించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బీమా పథకంతో పాటు సొంతింటి కలను కూడా నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# గ్రామాల అభివృద్ధికి గ్రామపంచాయతీ భవనాలు ఎంతో అవసరం

- **చిట్యాల వెంకటయ్య, వీరాయపల్లి సర్పంచ్**



**పెద్దమందడి,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ చిట్యాల వెంకటయ్య మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షల వ్యయంతో ఈ నూతన భవనాన్ని నిర్మించనున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ చిట్యాల వెంకటయ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామపంచాయతీ భవనాలు ఎంతో అవసరమని, గ్రామస్థులకు ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పంచాయతీ భవనం కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. గ్రామపంచాయతీల బలోపేతంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రాధాన్యతను నిలబెట్టుకుంటూ గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు.నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని, గ్రామ అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని సర్పంచ్ వెంకటయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఐ సత్యా రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ము వెంకటస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గట్టు యాదవ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


# ఇందిరమ్మ జీవిత బీమా భరోసా పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

- **అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక రక్షణ.. పథకం అమలులో నిర్లక్ష్యం వద్దని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం**



**మానకొండూర్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్ గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ హోదాలో పాల్గొన్న ఆయన సంబంధిత ప్రభుత్వ, ఆర్థిక శాఖ అధికారులతో కలిసి పథకం అమలు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అనుకోని పరిస్థితుల్లో కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణతో ఈ పథకాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో అండగా నిలుస్తుందని, ప్రతి అర్హ కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.మానకొండూర్ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు పథకం నమోదు విధానం, అర్హతలు, లబ్ధి పొందే ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. పథకం అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పేద కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు, సర్పంచులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, ఆర్థిక శాఖ ప్రతినిధులు, స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

- **ఇందిరమ్మ కుటుంబ బీమాతో ఆర్థిక భరోసా – వంగర సర్పంచ్ గజ్జెల సృజన రమేష్**
- **18 నుంచి 59 ఏళ్లలోపు వారికి అవకాశం – డిసెంబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ**
- **ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లింపు.. వంగరలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం**

**భీమదేవరపల్లి, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించనుందని వంగర గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ తెలిపారు. కుటుంబ పెద్ద అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

**కుటుంబానికి అండగా రూ.5 లక్షల బీమా**

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేటలో ఈ పథకాన్ని ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న వ్యక్తి మరణిస్తే పిల్లల చదువులు, కుటుంబ పోషణ, రోజువారీ ఖర్చుల విషయంలో ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని వివరించారు.

**ఒక కుటుంబంలో ఒకరికే బీమా అవకాశం**

ఈ పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబంలో సంపాదించే ఒక వ్యక్తికి మాత్రమే రూ.5 లక్షల జీవిత బీమా వర్తిస్తుంది. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నట్లయితే వారిలో ఎవరికి బీమా వర్తింపజేయాలనేది కుటుంబ సభ్యులు నిర్ణయించుకోవచ్చు. బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో ముందుగా నమోదు చేసిన నామినీకి బీమా మొత్తం అందుతుంది. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను నమోదు చేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు.

**18 నుంచి 59 ఏళ్లలోపు వారికి అర్హత**

ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులు. ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీ ఆధారంగా వయస్సును నిర్ధారిస్తారు. ఈ పథకంలో మరో ప్రత్యేకత ఏమిటంటే బీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని సర్పంచ్ వివరించారు.


**డిసెంబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ**

నవంబర్ 19 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ డిసెంబర్ 18 వరకు కొనసాగనుంది. అర్హులైన కుటుంబాలు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో బీమా పొందే వ్యక్తి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌తో పాటు అవసరమైన కుటుంబ వివరాలను తీసుకురావాలని కోరారు.

వంగర గ్రామంలోని అర్హులైన కుటుంబాలు అవసరమైన పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే తమ లక్ష్యమని, గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఈ పథకంపై అవగాహన కల్పించి దరఖాస్తుల నమోదుకు గ్రామపంచాయతీ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వల్లాల రమేష్, వార్డు సభ్యులు శ్రీరామోజు మొండయ్య, రమేష్, కాలువ అంజలి, బత్తిని అశోక్, గ్రామ కార్యదర్శి వీరన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు స్వయం ప్రయాణ భాగ్యం కల్పించిన గంగుల



- **సొంత ఖర్చులతో ఐదుగురికి ఎలక్ట్రిక్ మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ.. స్వయం ఆధారిత జీవనానికి భరోసా.**

**కరీంనగర్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్న మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మరోసారి తన సేవా నిరతిని చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో అవసరమైన వాహనాలను కొనుగోలు చేయలేని నిరుపేద దివ్యాంగులకు తన సొంత నిధులతో ఎలక్ట్రిక్ మూడు చక్రాల సైకిళ్లను అందజేశారు.

కరీంనగర్‌లోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో శివ కిషోర్, మాధవి, లచ్చయ్య, పోచమల్లు, శివ అనే ఐదుగురు లబ్ధిదారులకు ఎలక్ట్రిక్ మూడు చక్రాల సైకిళ్లను గంగుల కమలాకర్ పంపిణీ చేశారు. ఈ వాహనాల ద్వారా దివ్యాంగులు రోజువారీ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా ప్రయాణించడంతో పాటు తమ పనులను స్వతంత్రంగా చేసుకునేందుకు అవకాశం కలగనుంది. ఆర్థికంగా వెనుకబడిన, శారీరక వైకల్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా తన పరిధిలో ఉన్న నిరుపేదలకు వ్యక్తిగతంగా చేయూత అందిస్తూ, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి స్వయం ఆధారిత జీవనానికి తోడ్పడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

సైకిళ్లు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రయాణ కష్టాలు తీరడంతో పాటు నిత్యజీవితంలో ఎంతో వెసులుబాటు కలుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు.





## అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా అందించాలి.!

- **నాగుపల్లిలో తొలి ఆన్‌లైన్ నమోదు చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.**

**దమ్మపేట, నవంబరు 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. ఏ ఒక్క అర్హ కుటుంబం నమోదు కాకుండా మిగిలిపోరాదని స్పష్టం చేశారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంలో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గ తొలి నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో చేపట్టారు. గ్రామానికి చెందిన చిలకా లక్ష్మీదేవి పేరుతో తొలి ఆన్‌లైన్ నమోదును ఎమ్మెల్యే స్వయంగా ప్రారంభించారు. అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే పథకం లక్ష్యమన్నారు. గ్రామాల్లో అర్హులను గుర్తించి ప్రతి ఒక్కరికీ పథకం వర్తించేలా చూడాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్, పీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిశెట్టి సత్యప్రసాద్, ఎంపీడీవో రవీంద్ర రెడ్డి, ఎమ్మార్వో మద్దినేని మురళీ, ఏడీఈ రవికుమార్, సర్పంచ్ శ్రీనివాసరావు, కుంపటి వేణు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన చేనేత కార్మికులకు తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలి

- **చేనేత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి**
- **బీసీ జేఏసీ గౌరవాధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న విజ్ఞప్తి**

**హుజురాబాద్,నవంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రంలోని అర్హులైన చేనేత కార్మికులందరికీ ప్రభుత్వం తక్షణమే పెన్షన్లు మంజూరు చేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని హుజురాబాద్ నియోజకవర్గ బీసీ జేఏసీ గౌరవాధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేనేత వృత్తినే నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న కార్మికులు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, వారి కష్టాలను ప్రభుత్వం గుర్తించి అండగా నిలవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

హుజురాబాద్ పట్టణంలోని స్థానిక పద్మాలయ క్లాత్ స్టోర్ ఆవరణలో నిర్వహించిన బీసీ జేఏసీ కార్యకమంలో వారు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులకు మంజూరైన రుణాలను ప్రస్తుత ప్రభుత్వం మాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, చేనేత కార్మికుల పట్ల ప్రభుత్వం చూపిన చొరవను అభినందిస్తున్నామని తెలిపారు.

50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

చేనేత కార్మికులు తమ జీవితాలను పూర్తిగా చేనేత వృత్తికే అంకితం చేసి, చాలీచాలని కూలీ డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, వృత్తిలో ఆదాయం తగ్గడం, కుటుంబ పోషణ భారంగా మారడంతో అనేకమంది చేనేత కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వయస్సు మీదపడిన కార్మికులు వృత్తి చేయలేని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులతో జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో జియో ట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న 50 సంవత్సరాలు దాటిన అర్హులైన చేనేత కార్మికులందరికీ ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో ఉన్న చేనేత కార్మికులకు నెలనెలా పెన్షన్ అందించడం ద్వారా వారి కుటుంబాలకు కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు యారన్ సబ్సిడీ కల్పించాలి. అదేవిధంగా చేనేత సహకార సంఘాల మనుగడను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చేనేత సహకార సంఘాలు బలోపేతం కావాలంటే నూలు (యారన్) కొనుగోలుపై తగిన సబ్సిడీ మంజూరు చేయాలని సూచించారు. ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల చేనేత కార్మికులు, సహకార సంఘాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. యారన్ సబ్సిడీని అందించడం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గి చేనేత వృత్తికి చేయూత లభిస్తుందని పేర్కొన్నారు. చేనేత వృత్తిని కాపాడుకోవడం అంటే వేలాది కుటుంబాల జీవనాధారాన్ని కాపాడుకోవడమేనని, చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని ప్రత్యేక పథకాలు అమలు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు పెన్షన్లు, సహకార సంఘాలకు యారన్ సబ్సిడీ అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, తాటిపాముల కనకయ్య, మంచి కట్ల విజయకుమార్, ఆళ్ల కేశవులు, రాజన్న సంతోష్, బాబర్, ప్రజా సంఘాల నాయకులు తునికి సమ్మయ్య, తోగరు బుచ్చయ్య, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి కుటుంబానికి అండగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

- **హుజురాబాద్‌లో పథకాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు**
- **ఐదు వార్డుల అర్హులైన లబ్ధిదారులకు జీవిత బీమా నమోదు పత్రాల పంపిణీ**

**హుజురాబాద్,నవంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమే ధ్యేయంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు ప్రారంభించారు. పట్టణంలోని మాతృశ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 22వ, 23వ, 25వ, 29వ, 30వ వార్డులకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు జీవిత బీమా నమోదు పత్రాలను ఆమె అందజేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడంతో పాటు, అనుకోని ఆపద సమయంలో కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా అనుకోని ప్రమాదం లేదా విపత్కర పరిస్థితి ఎదురైతే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సాధారణ కుటుంబాలు భవిష్యత్తుపై భరోసాతో జీవించేందుకు ఇటువంటి సంక్షేమ పథకాలు దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో మున్సిపల్ పాలక వర్గం, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా అర్హులైన కుటుంబాలు పథకంలో నమోదు చేసుకునేలా అధికారులు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

హుజురాబాద్ పట్టణంలోని వివిధ వార్డుల్లో అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి పథకం ప్రయోజనాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, బీమా నమోదు ప్రక్రియకు సంబంధించి అవసరమైన వివరాలను అధికారులకు అందించి పథకంలో భాగస్వాములు కావాలని కోరారు.

ప్రజల జీవన భద్రతకు, కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఒక ముఖ్యమైన కార్యక్రమమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు భవిష్యత్తులో ఆర్థిక భద్రతపై నమ్మకం కలుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, అకౌంట్ సెక్షన్ గోపాల్, సంబంధిత వార్డుల కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ బీమా పథకం అమలుపై యాదగిరి సునీల్ రావు క్షేత్రస్థాయి పరిశీలన

- **రూ.5 లక్షల కుటుంబ జీవిత బీమా నమోదు శిబిరం సందర్శన**
- **అర్హులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన**

**కరీంనగర్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కరీంనగర్ నగరంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు శుక్రవారం సంబంధిత నమోదు శిబిరాన్ని సందర్శించి, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. పథకానికి సంబంధించిన అర్హతలు, నిబంధనలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.5 లక్షల జీవిత బీమా ప్రయోజనాన్ని అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. కుటుంబాన్ని పోషించే 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ఈ బీమాకు అర్హులని, వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డు ప్రతిని ప్రాతిపదికగా తీసుకుంటున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమీపంలోని మున్సిపల్ కార్యాలయం లేదా వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొయినుద్దీన్, ఆర్ఐలు కలీముల్లా ఖాన్, కొత్తకొండ శ్యామ్ సుందర్, వార్డు ఆఫీసర్ పారిపెల్లి రాజు, జవాన్ నాగరాజు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శనివారం - 21 - నవంబర్ 2026
వరంగల్ 05

## ఎస్.ఏ. సంపత్ కుమార్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ నాయకులు



**వనపర్తి,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి ఎస్.ఏ. సంపత్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఐఎన్‌టీయూసీ తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దయ్యాల దాసు, వెల్తూరి అశోక్, గద్దల ప్రభాకర్ తదితరులు సంపత్ కుమార్‌ను కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్.ఏ. సంపత్ కుమార్ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని,ప్రజా జీవితంలో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## మెడికల్ సీటు సాధించిన భవ్యశ్రీకి ఎమ్మెల్యే సత్కారం



**పెద్దమందడి,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని అమ్మపల్లి గ్రామానికి చెందిన బోయిని భవ్యశ్రీ ఆసిఫాబాద్‌లో మెడికల్ సీటు సాధించడంతో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్ అన్న శివ యాదవ్, పద్మ దంపతుల కుమార్తె భవ్యశ్రీ వైద్య విద్యకు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందిస్తూ ఆమె భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి వైద్య రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు కన్న ఊరికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యాపరంగా ఎలాంటి అవసరాలు, సహాయ సహకారాలు కావాలన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, వెంకటేశ్వర రెడ్డి, బాలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దళిత చైతన్య సభను విజయవంతం చేయాలి

- **గట్టు మన్నెం కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**పెద్దమందడి,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** నేడు నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించనున్న దళిత చైతన్య సభను విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా పెద్దమందడి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు మన్నెం కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు హాజరయ్యేలా కృషి చేయాలని కోరారు.మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సభ విజయవంతానికి బాధ్యతగా పనిచేయాలని సూచించారు.ప్రజా ప్రభుత్వ పాలనలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దళితులతో పాటు ప్రజలకు వివరించేందుకు ఈ సభ ఒక వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేసి సభను విజయవంతం చేయాలని గట్టు మన్నెం కోరారు.

# విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ పంపిణీ చేసిన ఎంఈఓ ప్రకాష్




**అడ్డాకుల,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన పాఠశాల యూనిఫామ్స్, షూస్‌ను ఎంఈఓ ప్రకాష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ అందజేసి వారి చదువుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం యూనిఫామ్స్, షూస్ పంపిణీ చేస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సువర్ణలత, ఉపాధ్యాయులు భాస్కర్, శాంతాబాయి, పాఠశాల చైర్మన్ మంగరాయి భార్గవి, ఉపసర్పంచ్ రాధ శివ, ఐదో వార్డు సభ్యులు వై. ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు రంజిత్ కుమార్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టిన చిన్నారులు






- **కిడ్స్ కేర్ స్కూల్‌లో సాంప్రదాయ, సాంస్కృతిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ**
- **చిన్నారుల వేషధారణలు, నృత్య ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు**

**కరీంనగర్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో కరీంనగర్‌లోని కిడ్స్ కేర్ సెంటర్ అండ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సాంప్రదాయ, సాంస్కృతిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు వివిధ సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల రంగురంగుల వేషధారణలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల ఉత్సాహభరిత ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఎంతగానో అలరించాయి. చిన్నతనం నుంచే పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జక్కుల గిరిబాబు పాల్గొని చిన్నారుల ప్రదర్శనలను తిలకించి వారిని అభినందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవని, వాటి గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని చిన్నారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# దేవమ్మ మృతికి వడ్డే శేఖర్ ప్రగాఢ సంతాపం



**పెద్దమందడి,నవంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామానికి చెందిన బత్తుల బుడ్డన్న భార్య దేవమ్మ మృతి పట్ల గ్రామ కాంగ్రెస్ నాయకుడు వడ్డే శేఖర్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా దేవమ్మ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి భర్త బత్తుల బుడ్డన్నను,కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, దేవమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.





# సొంతింటి కల నెరవేర్చుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

**ఇల్లందకుంట, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు వారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరడంతో పాటు ఆర్థిక భరోసా లభిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధితో పాటు కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రం, లక్ష్మాజిపల్లి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు, నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసే కార్యక్రమాలకు ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు నిర్మించుకోవాలనే కల ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమ కోరిక నెరవేరిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముందుకు తీసుకెళ్తోందన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వివిధ గ్రామాల సర్పంచులు, జమ్మికుంట పట్టణ నాయకులు, ఇల్లందకుంట మండల నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# గ్రామీణ పేదలకు ప్రభుత్వ పథకాల భరోసా

- ఇందిరమ్మ బీమా పత్రాలు, నూతన రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్ ప్రొసీడింగ్స్ పంపిణీ

**ఇల్లందకుంట, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడమే లక్ష్యంగా కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పత్రాలు, నూతన రేషన్ కార్డులు, చేయూత ఆసరా పెన్షన్ మంజూరు ఉత్తర్వుల ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను చేరవేయడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించడం, గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాసేవకు నిరంతరం కట్టుబడి ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిరిసేడు గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





# విద్య ద్వారానే వికాసం.. ప్రపంచ దేశాలకు విద్యాభారతి ఆదర్శం

- భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన విలువల విద్యను అందించడమే విద్యాభారతి లక్ష్యం
- లింగం సుధాకర్ రెడ్డి

**జమ్మికుంట, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** విద్య ద్వారానే వ్యక్తి వికాసం, సమాజ అభివృద్ధి సాధ్యమని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలతో కూడిన విద్యను అందించడంలో విద్యాభారతి సంస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి అన్నారు. జమ్మికుంట పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్‌తో కలిసి నూతన భవనాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా లింగం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ నైతిక విలువలతో కూడిన విద్యను అందించే సంస్థలు విద్యాభారతి, సరస్వతి శిశు మందిర్ పాఠశాలలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇటువంటి పాఠశాలల్లో చేర్పించి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులుగా తయారు చేయాలని కోరారు. పాఠశాలల అభివృద్ధికి సమాజం నుంచి మరింత ఆదరణ లభించాలని, దాతలు, పాఠశాల సమితులు, కార్యవర్గాలు సహకరిస్తే తరగతి గదులతో పాటు గ్రంథాలయాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, చిన్నారుల పార్కుల వంటి సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

అనంతరం పాఠశాల అభివృద్ధి ప్రస్థానాన్ని వివరిస్తూ నిర్వాహకులు మాట్లాడుతూ ఒకప్పుడు తెలుగు మాధ్యమంలో విద్యార్థులకు ప్రాధాన్యతనిస్తూ విద్యాబోధన అందించామని, మారుతున్న కాలానికి అనుగుణంగా జాతీయ విద్యా విధానాన్ని అనుసరిస్తూ ఇంగ్లీష్ మీడియంలోనూ బోధన ప్రారంభించామని తెలిపారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో స్థిరపడి ఉన్నత స్థాయికి ఎదగడం గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మంతెన హేమలత, ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ పాక సత్యనారాయణ, శ్రీ సరస్వతి విద్యాపీఠం అధ్యక్షుడు ముక్కాల సీతారాములు, పూర్వ విద్యార్థి, సినీ దర్శకుడు వీరి వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, జిల్లా కార్యదర్శి తెల్ల రాజమౌళి, డాక్టర్ చిట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆవాల రాజారెడ్డి, ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, దాస రవీందర్, బుర్ర శివయ్య, కేతిపల్లి మాధవరెడ్డి, పాకాల రవీందర్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, ప్రధానాచార్యులు గుడికందుల సుదర్శన్, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# జమ్మికుంటలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమానికి శ్రీకారం

- అర్హులందరూ బీమా నమోదు చేసుకోవాలి
- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**జమ్మికుంట, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమం జమ్మికుంట పట్టణంలో ప్రారంభమైంది. గురువారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి ఒక భరోసాగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం ఎదురైనప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఇలాంటి బీమా పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంతటి మంచి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ పేర్లను బీమా పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం తమ తమ వార్డులకు వచ్చే వార్డు అధికారులను సంప్రదించి రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో వివరాలు అందించి బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు, మేనేజర్ గుర్రాల రాజిరెడ్డి, వార్డు అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట వేదికగా ఎస్ఎఫ్ఐ జిల్లా 19వ మహాసభలు



- మహాసభలను విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి
- జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

**జమ్మికుంట, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా 19వ మహాసభలను డిసెంబర్ 2, 3 తేదీల్లో జమ్మికుంట మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ తెలిపారు. ఈ మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఎస్ఎఫ్ఐ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో జమ్మికుంట వొకేషనల్ కళాశాలలో ఆవిష్కరించారు. తొలిసారిగా జమ్మికుంటలో నిర్వహిస్తున్న ఈ మహాసభలను విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించిన ఘనత ఎస్ఎఫ్ఐకి ఉందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, భవిష్యత్తులో చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త చట్టాలు, విధానాల పేరుతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంటోందని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా 19వ మహాసభల్లో విద్యారంగ సమస్యలపై సమగ్రంగా చర్చించి, వాటి పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జమ్మికుంట మండల అధ్యక్ష, కార్యదర్శులు సిద్దిక్, అనిల్, నాయకులు మహేష్, అక్షయ్, అలీ, మహేందర్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ భీమాతో పేద కుటుంబాలకు కొండంత భరోసా

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందించాలి
- సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యకు కృతజ్ఞతలు
- సింగపురం దయాకర్,జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి



**స్టేషన్ ఘనపూర్,నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ భీమా పథకం ఎంతో ఉపయోగకరమని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి,ఎంపిటిసిల ఫోరమ్ స్టేషన్ ఘనపూర్ మాజీ మండల అధ్యక్షుడు సింగపురం దయాకర్ అన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా అండగా నిలవడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు.ఇందిరమ్మ భీమా పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్యకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని సింగపురం దయాకర్ కోరారు.

## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- పౌరసరఫరాల కమిషనర్ నాగిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జీఎంఆర్
- డీలర్లకు గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ కోరిన ప్రతినిధులు
- ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి
- ప్రభుత్వంతో చర్చించి ప్రాధాన్యత ఇస్తానని కమిషనర్ హామీ

**పటాన్‌చెరు, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే, తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ నాగిరెడ్డిని కోరారు. ఇటీవల నూతన కమిషనర్‌గా నియమితులైన నాగిరెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే జీఎంఆర్ నేతృత్వంలోని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, డీలర్ల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్న డీలర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం కల్పించడంతో పాటు, ప్రతి క్వింటాలుకు రూ.300 కమిషన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారం ద్వారా డీలర్లకు ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించారు. అలాగే రేషన్ దుకాణాల్లో ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని ప్రతినిధులు కోరారు. డీలర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ఆరోగ్య బీమా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రమాదాలు, ఆరోగ్య సమస్యల నేపథ్యంలో బీమా రక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో పనిచేసే డీలర్లకు తగిన గుర్తింపు, సంక్షేమ సదుపాయాలు కల్పించాలని కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శనివారం - 21 - నవంబర్ 2026


# కొలిపాక సతీష్.. రాజయ్య రాజకీయ ప్రస్థానం తెలుసుకొని మాట్లాడు!

- **400 కోట్ల అభివృద్ధి లెక్కలపై బహిరంగ చర్చకు సిద్ధమా?**
- **ఆధారాలతో నిరూపించేందుకు మేము సిద్ధం**
- **బిఆర్ఎస్ యువ నేత మారపెల్లి ప్రసాద్ బాబు**




**స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి, తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య రాజకీయ ప్రస్థానంపై కాంగ్రెస్ నాయకుడు కొలిపాక సతీష్ చేస్తున్న వ్యాఖ్యలను బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు, కౌన్సిలర్ అభ్యర్థి మారపెల్లి ప్రసాద్ బాబు తీవ్రంగా ఖండించారు. రాజయ్య రాజకీయ ప్రస్థానం, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర, నియోజకవర్గానికి చేసిన సేవల గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతే మాట్లాడాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా మారపెల్లి ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. డాక్టర్ తాటికొండ రాజయ్య రాజకీయ ప్రస్థానం నిన్న మొన్న ప్రారంభమైంది కాదని, 1999 నుంచి 2009 వరకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. 2004-2009 మధ్య కాంగ్రెస్, టీఆర్ఎస్ పొత్తులో భాగంగా తన ఎమ్మెల్యే టికెట్‌ను గుండె విజయరామారావు కోసం త్యాగం చేసి, ఆయన విజయానికి కృషి చేశారని గుర్తుచేశారు. 2009 నుంచి 2013 వరకు ఎమ్మెల్యేగా, అనంతరం 2013 నుంచి 2023 వరకు వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు.

2004 నుంచి 2023 వరకు కడియం శ్రీహరి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా లేని విషయాన్ని కొలిపాక సతీష్ గుర్తుంచుకోవాలని అన్నారు. ఆ కాలంలో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన నాయకుల కృషి, అభివృద్ధి కార్యక్రమాల చరిత్రను పక్కనపెట్టి ఇతరుల ఖాతాలో అభివృద్ధిని వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్య, వైద్యం, రహదారులు, సాగునీరు, మౌలిక సదుపాయాలు, పేదల సంక్షేమం వంటి రంగాల్లో రాజయ్య హయాంలో చేపట్టిన పనులను ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు.

**1,400 కోట్ల అభివృద్ధి లెక్కలపై బహిరంగ చర్చకు సిద్ధమా**

కడియం శ్రీహరి ప్రచారంలో పేర్కొంటున్న రూ.1,400 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలపై ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ పలు ప్రశ్నలు లేవనెత్తిందని ప్రసాద్ బాబు తెలిపారు. ఏ పనిని ఎవరు ప్రతిపాదించారు? ఏ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి? ఎవరి హయాంలో పనులు ప్రారంభమయ్యాయి? ఎప్పుడు పూర్తయ్యాయి? ప్రజలకు వాస్తవంగా ఎలాంటి ప్రయోజనం కలిగింది? అనే అంశాలపై ఆధారాలతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినంత మాత్రాన అభివృద్ధి చేసినట్లు కాదని, ప్రచారంలో కోట్ల రూపాయలు చెప్పుకున్నంత మాత్రాన ఆ పనుల ఘనత ఎవరికీ దక్కదని వ్యాఖ్యానించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచి చర్చకు రావాలని కొలిపాక సతీష్‌కు సవాల్ విసిరారు.

**తెలంగాణ ఉద్యమంలో రాజయ్య పాత్రను విస్మరించలేరు**


తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో డాక్టర్ తాటికొండ రాజయ్య పోషించిన పాత్ర, రాజకీయంగా చేసిన త్యాగాలను విస్మరించలేమని ప్రసాద్ బాబు పేర్కొన్నారు. 2004లో పొత్తు ధర్మం కోసం ఎమ్మెల్యే టికెట్‌ను త్యాగం చేసి గుండె విజయరామారావు విజయానికి సహకరించిన విషయాన్ని గుర్తుచేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నాయకుడిపై విమర్శలు చేసే ముందు ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రజా సేవను తెలుసుకోవాలని సూచించారు.

**కొలిపాక సతీష్‌కు బహిరంగ సవాల్**

2004 నుంచి 2023 వరకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు, రూ.1,400 కోట్ల అభివృద్ధి ప్రచారం, డాక్టర్ తాటికొండ రాజయ్య హయాంలో మంజూరైన పనులు, తెలంగాణ ఉద్యమంలో నాయకుల పాత్ర వంటి అంశాలపై బహిరంగ చర్చకు రావాలని మారపెల్లి ప్రసాద్ బాబు సవాల్ విసిరారు. తాము అన్ని వివరాలను ఆధారాలతో ప్రజల ముందుంచేందుకు సిద్ధంగా ఉన్నామని, కొలిపాక సతీష్ కూడా చర్చకు సిద్ధం కావాలని అన్నారు. రాజకీయంగా ఎదగాలంటే ప్రజలకు సేవ చేయాలని, పదవుల కోసం సీనియర్ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ విమర్శలు వాస్తవాలు, ఆధారాల ఆధారంగా ఉండాలని, వ్యక్తిగత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

# ప్రతిపక్షం బలహీనమైతే ప్రజాస్వామ్యానికి ప్రమాదమేనా?

- **అధికారాన్ని ప్రశ్నించే గొంతుకలు బలంగా ఉన్నప్పుడే పాలనలో జవాబుదారీతనం**
- **ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలించడం ప్రతిపక్షం ప్రాథమిక బాధ్యత**
- **రాజకీయ కక్షలు, అంతర్గత విభేదాలతో బలహీనపడుతున్న ప్రతిపక్ష పాత్ర**
- **అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ ప్రజల ప్రయోజనాలకే పనిచేయాలి**



**డెస్క్, నవంబర్ 20,( తెలంగాణ ముచ్చట్లు)** ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం మాత్రమే కాదు. ప్రజల తరపున పాలనను ప్రశ్నించే వ్యవస్థ, అధికారాన్ని నియంత్రించే రాజ్యాంగబద్ధమైన యంత్రాంగం, భిన్నాభిప్రాయాలకు గౌరవం ఇచ్చే రాజకీయ సంస్కృతి కూడా అందులో అంతర్భాగాలు. ఈ వ్యవస్థలో అధికార పక్షానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో ప్రతిపక్షానికీ అంతే ప్రాధాన్యం ఉంటుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను పరిశీలించడం, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను సభల్లో ప్రస్తావించడం, విధానాల్లోని లోపాలను ఎత్తిచూపడం ప్రతిపక్షం నిర్వహించాల్సిన కీలక బాధ్యతలు. అయితే ప్రతిపక్షం బలహీనపడితే ఈ బాధ్యతలను ఎవరు నిర్వర్తిస్తారు? అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే గొంతుకలు తగ్గిపోతే ప్రజల సమస్యలకు ప్రాధాన్యం తగ్గిపోదా? అనే ప్రశ్నలు నేడు ప్రజాస్వామ్య వ్యవస్థల ముందు నిలుస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రభుత్వం ఎంత అవసరమో, బాధ్యతాయుతమైన ప్రతిపక్షం కూడా అంతే అవసరం.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేస్తోంది? ప్రజాధనం ఎలా ఖర్చు చేస్తోంది? అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరుతున్నాయా? సంక్షేమ పథకాల అమలులో లోపాలున్నాయా? అనే అంశాలను నిరంతరం పరిశీలించాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉంటుంది. శాసనసభలు, పార్లమెంటు వంటి ప్రజాస్వామ్య వేదికల్లో ప్రజా సమస్యలను లేవనెత్తడం, ప్రభుత్వాన్ని వివరణ కోరడం, అవసరమైనప్పుడు ప్రత్యామ్నాయ విధానాలను సూచించడం దాని ప్రధాన విధులు. ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తే ప్రభుత్వ నిర్ణయాల్లో పారదర్శకత పెరుగుతుంది. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయాలపై చర్చ జరిగే అవకాశం ఉంటుంది. కానీ ప్రతిపక్షం సంఖ్యాబలంలోనూ, రాజకీయ ఐక్యతలోనూ బలహీనపడితే సభల్లో ప్రభుత్వాన్ని నిలదీసే సామర్థ్యం తగ్గుతుంది. అధికార పక్షం తీసుకునే నిర్ణయాలపై సమగ్ర చర్చ జరగకపోవడం, ప్రజా సమస్యలు రాజకీయ ప్రాధాన్యం కోల్పోవడం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. ఇది కేవలం ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన సమస్య కాదు.. ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రభావితం చేసే అంశం.

ప్రతిపక్షం బలహీనపడటానికి అనేక కారణాలు ఉంటాయి. ఎన్నికల్లో వరుస ఓటములు, నాయకత్వ లోపం, పార్టీల మధ్య ఐక్యత లేకపోవడం, అంతర్గత విభేదాలు, ప్రజల్లో విశ్వాసం కోల్పోవడం వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో అధికార పక్షం బలమైన ప్రజా దరణతో ముందుకు సాగవచ్చు. అలాంటి సమయంలో ప్రతిపక్షానికి ప్రజల మద్దతు తగ్గడం సహజమే. అయితే ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన ప్రతిపక్ష బాధ్యతలు ముగిసిపోవు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిపై పోరాటం చేయడం, క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలు కొనసాగించడం, ప్రభుత్వ విధానాలపై వాస్తవాల ఆధారంగా విమర్శలు చేయడం ద్వారా తిరిగి ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చు. కానీ ప్రజా సమస్యలను పక్కనపెట్టి నాయకుల మధ్య ఆధిపత్య పోరాటాలు, పదవుల కోసం అంతర్గత కుమ్ములాటలు, వ్యక్తిగత విమర్శలకే రాజకీయాలను పరిమితం చేస్తే ప్రజలు ప్రతిపక్షంపై నమ్మకం కోల్పోతారు. అధికార పక్షాన్ని విమర్శించడమే ప్రతిపక్ష రాజకీయం కాదు. ప్రజలకు ఉపయోగపడే ప్రత్యామ్నాయ విధానాలను చూపించడం, సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించడం కూడా అంతే ముఖ్యం. మరోవైపు అధికార పక్షం కూడా ప్రతిపక్షాన్ని రాజకీయ ప్రత్యర్థిగా మాత్రమే చూడకూడదు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రశ్నలు, నిరసనలు సహజమైన ప్రక్రియలు. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించినంత మాత్రాన ఎవరినీ ప్రజా వ్యతిరేకులుగా ముద్ర వేయడం సరైన రాజకీయ సంస్కృతి కాదు. ప్రతిపక్షం లేవనెత్తే ప్రతి అంశాన్ని రాజకీయ విమర్శగా కొట్టిపారేయకుండా అందులోని వాస్తవాలను పరిశీలించాలి. విమర్శల్లో తప్పులుంటే ఆధారాలతో సమాధానం చెప్పాలి. సరైన సూచనలు ఉంటే స్వీకరించాలి. అదే సమయంలో ప్రతిపక్షాలు కూడా ప్రజాస్వామ్య వేదికలను అడ్డుకోవడం, నిరాధార ఆరోపణలు చేయడం, ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకించడమే లక్ష్యంగా పెట్టుకోవడం వంటి ధోరణులకు దూరంగా ఉండాలి. అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య రాజకీయ పోటీ ఉండవచ్చు కానీ ప్రజా ప్రయోజనాల విషయంలో పరస్పర బాధ్యత ఉండాలి. సభలు చర్చలకు వేదికలుగా నిలవాలి తప్ప రాజకీయ ఆరోపణలు, వ్యక్తిగత దూషణలకు కేంద్రాలుగా మారకూడదు. ప్రజాస్వామ్య సంస్థలు స్వతంత్రంగా, సమర్థంగా పనిచేసే వాతావరణాన్ని కాపాడటం ఇరు పక్షాల బాధ్యత.

నిజానికి ప్రజాస్వామ్యానికి ప్రమాదం ప్రతిపక్షం బలహీనపడటంతోనే మొదలవుతుందని చెప్పలేం. ప్రజల విశ్వాసం కోల్పోయిన ప్రతిపక్షం స్థానంలో బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఎదగవచ్చు. అయితే అధికారాన్ని ప్రశ్నించే వ్యవస్థాగత అవకాశాలు తగ్గిపోవడం, విమర్శలకు తగిన ప్రాధాన్యం లేకపోవడం, ప్రజా సమస్యలపై చర్చలు బలహీనపడటం మాత్రం ఆందోళన కలిగించే పరిణామాలు. ప్రజాస్వామ్య బలం అధికార పక్షం సాధించిన సీట్ల సంఖ్యలో మాత్రమే ఉండదు. ప్రతిపక్షం స్వేచ్ఛగా తన అభిప్రాయాలను వ్యక్తం చేయగలగడం, ప్రజలు నిర్భయంగా ప్రశ్నించగలగడం, మీడియా స్వతంత్రంగా వ్యవహరించడం, రాజ్యాంగ సంస్థలు తమ బాధ్యతలను నిర్వర్తించడం వంటి అంశాల్లోనూ ఉంటుంది. ప్రతిపక్షం బలంగా ఉండాలని కోరుకోవడం అంటే అధికార పక్షం బలహీనంగా ఉండాలని కోరుకోవడం కాదు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కోరుకోవడమే దాని వెనుక ఉన్న అసలు ఉద్దేశం. ఎన్నికల్లో గెలిచిన పార్టీకి పాలించే అధికారం ప్రజలు ఇస్తే, ఆ పాలనను పరిశీలించే బాధ్యతను ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతిపక్షానికి అప్పగిస్తుంది. అందుకే బలమైన అధికార పక్షంతో పాటు బాధ్యతాయుతమైన ప్రతిపక్షం, చైతన్యవంతమైన పౌర సమాజం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉంటుంది. ప్రశ్నించే గొంతుకలు బలంగా ఉన్నప్పుడే పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది.. ప్రజల హక్కులు సురక్షితంగా ఉంటాయి.

# తులసి వివాహం.. ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా పవిత్ర సంప్రదాయం!



- **హిందూ సంస్కృతిలో తులసి మొక్కకు విశిష్టమైన స్థానం**
- **శ్రీమహావిష్ణువు, తులసి దేవి కల్యాణంతో శుభకార్యాలకు శ్రీకారం**
- **ఇళ్లలో భక్తిశ్రద్ధలతో తులసి వివాహ వేడుకలు**
- **ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి పరిరక్షణ సందేశం**

**డెస్క్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో తులసి మొక్కకు అత్యంత పవిత్రమైన స్థానం ఉంది. హిందూ కుటుంబాల్లో తులసిని కేవలం ఒక మొక్కగా కాకుండా దైవ స్వరూపంగా భావించి పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇంటి ఆవరణలో తులసి కోటను ఏర్పాటు చేసి ప్రతిరోజూ దీపారాధన చేయడం, నీటిని సమర్పించడం, ప్రదక్షిణలు చేయడం అనేక కుటుంబాల్లో నేటికీ కొనసాగుతోంది. కార్తీక మాసంలో నిర్వహించే ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తులసి వివాహానికి విశిష్టమైన ప్రాధాన్యం ఉంది. తులసి దేవిని శ్రీమహావిష్ణువు లేదా ఆయన అవతారమైన శ్రీకృష్ణుడితో వివాహం జరిపించే ఈ పవిత్ర వేడుకను తులసి కల్యాణం అని కూడా పిలుస్తారు. హిందూ పురాణాలు, సంప్రదాయాల ప్రకారం తులసి వివాహం నిర్వహించిన అనంతరం శుభకార్యాలు, వివాహ వేడుకలు ప్రారంభించేందుకు అనుకూలమైన కాలంగా భావిస్తారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ వేడుకలో ఆధ్యాత్మిక విశ్వాసం, కుటుంబ ఐక్యత, ప్రకృతి పట్ల గౌరవం అంతర్లీనంగా కనిపిస్తాయి.

పురాణాల ప్రకారం తులసి దేవి పూర్వజన్మలో బృంద అనే పేరుతో జన్మించిన భక్తురాలిగా కథలు ప్రచారంలో ఉన్నాయి. ఆమె భర్త జలంధరుడు. బృందకు ఉన్న పాతివ్రత్య శక్తి కారణంగా జలంధరుడు శక్తిమంతుడిగా మారాడని పురాణ గాథలు చెబుతాయి. జలంధరుడి దుష్టత్వాన్ని అంతం చేసేందుకు శ్రీమహావిష్ణువు ఒక ఉపాయం అనుసరించాల్సి వచ్చిందని కథనం. ఈ పరిణామంతో మనస్తాపానికి గురైన బృంద విష్ణువును శిలగా మారాలని శపించిందని, అనంతరం ఆమె తులసి మొక్కగా అవతరించిందని పురాణ విశ్వాసం. బృంద భక్తికి గుర్తింపుగా శ్రీమహావిష్ణువు తులసికి తన ఆరాధనలో ప్రత్యేక స్థానం కల్పించాడని చెబుతారు. అందుకే విష్ణు పూజలో తులసి దళాలకు విశేష ప్రాధాన్యం ఉంది. తులసి లేకుండా విష్ణు ఆరాధన సంపూర్ణం కాదనే విశ్వాసం భక్తుల్లో బలంగా ఉంది. ఈ పురాణ నేపథ్యాన్ని గుర్తుచేసుకుంటూ కార్తీక మాసంలో తులసి వివాహాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా నిర్వహిస్తారు.

తులసి వివాహ వేడుకను సాధారణంగా కార్తీక శుక్ల ద్వాదశి రోజున నిర్వహిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి తిథులను అనుసరించి వేర్వేరు తేదీల్లో ఈ వేడుక జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఇంటి ఆవరణలోని తులసి కోటను శుభ్రం చేసి పసుపు, కుంకుమ, పూలతో అందంగా అలంకరిస్తారు. తులసి మొక్కకు చీర, ఆభరణాలు అలంకరించి వధువులా ముస్తాబు చేస్తారు. శ్రీమహావిష్ణువు లేదా శ్రీకృష్ణుడి ప్రతిమను వరుడిగా భావించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పూజారి లేదా కుటుంబ పెద్దల ఆధ్వర్యంలో వివాహ తంతును సంప్రదాయబద్ధంగా జరుపుతారు. మంగళ వాయిద్యాలు, భజనలు, మంత్రోచ్చారణల మధ్య కల్యాణ వేడుక నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పండ్లు, పూలు, పిండి వంటలు, నైవేద్యాలు సమర్పించి భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొంటారు. కొన్ని ప్రాంతాల్లో తులసి కోట చుట్టూ చెరకు, ఉసిరి మొక్కలను ఉంచి ప్రత్యేక అలంకరణలు చేస్తారు. ఈ వేడుకలో మహిళలు మంగళ హారతులు ఇచ్చి కుటుంబ సౌభాగ్యం, సుఖసంతోషాల కోసం ప్రార్థిస్తారు.

హిందూ సంప్రదాయంలో తులసి మొక్కకు ఆధ్యాత్మిక ప్రాధాన్యంతో పాటు ఆరోగ్యపరమైన ఉపయోగాలు కూడా ఉన్నాయి. ఆయుర్వేదంలో తులసి ఆకులను అనేక విధాలుగా ఉపయోగిస్తారు. తులసిలో ఉండే సహజసిద్ధమైన పదార్థాలపై వివిధ పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. అయితే ఏ ఆరోగ్య సమస్యకైనా తులసిని వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయంగా భావించకూడదు. మరోవైపు తులసి మొక్కను ఇంటి ఆవరణలో పెంచడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించుకోవచ్చు. మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై కుటుంబ సభ్యుల్లో ఆసక్తి పెరుగుతుంది. భారతీయ సంప్రదాయాల్లో మొక్కలను దైవ స్వరూపాలుగా భావించి పూజించడం వెనుక ప్రకృతిని గౌరవించాలనే భావన కూడా కనిపిస్తుంది. తులసి వివాహం వంటి ఆచారాలు ఈ ఆలోచనను తరతరాలకు అందిస్తున్నాయి. ఆధునిక జీవన విధానంలో పచ్చదనం తగ్గిపోతున్న తరుణంలో ప్రతి ఇంట్లో మొక్కలను పెంచడం, వాటిని సంరక్షించడం పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతుంది.

తులసి వివాహం కేవలం ఒక మత పరమైన వేడుక మాత్రమే కాదు.. భారతీయ కుటుంబ సంప్రదాయాలు, భక్తి భావం, ప్రకృతి ఆరాధన కలగలిసిన ప్రత్యేకమైన ఆచారం. ఈ వేడుక ద్వారా కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి సంప్రదాయాలను పాటించడం, పిల్లలకు మన సంస్కృతి గురించి తెలియజేయడం జరుగుతుంది. కార్తీక మాసంలో దీపారాధనలు, ప్రతాలు, పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. తులసి కల్యాణం అనంతరం వివాహాలు, ఇతర శుభకార్యాల నిర్వహణకు అనుకూలమైన సమయం ప్రారంభమైందని అనేక కుటుంబాలు విశ్వసిస్తాయి. ప్రాంతాలను బట్టి పూజా విధానాలు, ఆచారాల్లో కొంత వ్యత్యాసం ఉన్నప్పటికీ భక్తి భావం మాత్రం ఒకేలా ఉంటుంది. నేటి తరం పిల్లలకు ఇలాంటి సంప్రదాయాల వెనుక ఉన్న పురాణ గాథలు, సాంస్కృతిక విలువలు, ప్రకృతి పరిరక్షణ భావనను వివరించడం అవసరం. ఆచారాలను పాటించడంతో పాటు మొక్కలను పెంచడం, పర్యావరణాన్ని కాపాడటం కూడా మన బాధ్యతగా భావించాలి. భక్తి, సంప్రదాయం, ప్రకృతి ప్రేమను ఒకే వేదికపైకి తీసుకొచ్చే తులసి వివాహం భారతీయ సంస్కృతిలో తన ప్రత్యేకతను చాటుకుంటోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# మాదిగ ఉపకులాల వనభోజనాలకు ప్రముఖులకు ఆహ్వానం

- **నవంబర్ 29న హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం**
- **మంత్రులు, ప్రజాప్రతినిధులు, సామాజిక ఉద్యమ నాయకులకు ఆహ్వాన పత్రికల అందజేత**
- **డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆహ్వాన కార్యక్రమాలు**

**హైదరాబాద్,నవంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు):** మాదిగ ఉపకులాల ఐక్యత, ఆత్మీయత, సామాజిక సమైక్యతను చాటిచెప్పే లక్ష్యంతో ఈ నెల 29న హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న మాదిగ ఉపకులాల వనభోజనాలు, అలయ్ బలయ్ కార్యక్రమానికి సన్నాహాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, మాదిగ ఉద్యమ నేతలను ఆహ్వానిస్తూ నిర్వాహకులు ప్రత్యేక ఆహ్వాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో నాయకులు పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి నవంబర్ 29న జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. అదేవిధంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు.

నకిరేకల్ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఉస్మానియా విశ్వవిద్యాలయం చీఫ్ వార్డెన్ డాక్టర్ గ్యార శ్రీనివాస్‌లను సైతం కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అలాగే మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను డాక్టర్ పిడమర్తి రవితో కలిసి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న మాదిగ ఉపకులాల వనభోజనాలు, అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని మంత్రిని కోరారు.ఈ ఆహ్వాన కార్యక్రమాల్లో దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల మల్లికార్జున్, నేషనల్ దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు భూదాల బాబురావు, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, మాదిగ జేఏసీ నాయకులు సుందిళ్ల సతీష్, దేవరకొండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మాదిగ ఉపకులాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయడం, పరస్పర పరిచయాలు, ఆత్మీయ సంబంధాలను పెంపొందించడం, సామాజికంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ వనభోజనాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కులాలు, ప్రాంతాలు, వర్గాలకు అతీతంగా ఆత్మీయ వాతావరణంలో నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ఐక్యతా సందేశాన్ని సమాజానికి అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ ఉపకులాల ప్రజలు, యువత, మహిళలు, ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు, సామాజిక ఉద్యమ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. నవంబర్ 29న హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే ఈ వనభోజనాలు, అలయ్ బలయ్ కార్యక్రమాన్ని అందరి సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.





# మెట్‌పల్లిలో 3,737 మందికి కొత్తగా సామాజిక భద్రతా పింఛన్లు





- **లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ**
- **మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరు**
- **పింఛన్లతో వివిధ వర్గాలకు ఆర్థిక భరోసా**
- **అర్హులైన వారికి పింఛన్లు అందేలా ప్రత్యేక పరిశీలన**

**జగిత్యాల, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో నూతనంగా మంజూరైన 3,737 సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, వెలమ సంఘ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు పంపిణీ చేశారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, అర్హులకు వాటి ఫలాలు అందించే అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన, జీవనోపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వర్గాలకు పింఛన్లు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులతో పాటు కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు పింఛన్లు మంజూరు చేయడం ద్వారా వారి జీవనానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి నెలా అందే పింఛన్ వృద్ధులు, ఇతర అర్హులైన లబ్ధిదారుల రోజువారీ అవసరాలకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. కుటుంబ సభ్యులపై పూర్తిగా ఆధారపడకుండా తమ వ్యక్తిగత అవసరాలను కొంతమేర తీర్చుకునేందుకు ఈ మొత్తం తోడ్పడుతుందని తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించడం ద్వారా సామాజిక భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు. పింఛన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఇంకా మంజూరు కాని వారి సమస్యలను పరిశీలించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ఆయా కౌంటర్ల ద్వారా దరఖాస్తులు, అర్హతలను పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అర్హత కలిగిన ఎవరూ పింఛన్ ప్రయోజనానికి దూరం కాకుండా పరిశీలన ప్రక్రియ చేపడతామని చెప్పారు. మెట్‌పల్లిలో కొత్తగా 3,737 మందికి పింఛన్లు మంజూరు కావడంతో ఆయా కుటుంబాలకు ప్రతి నెలా ఆర్థిక సహాయం అందనుంది. పింఛన్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, వివిధ వృత్తులపై ఆధారపడిన వారికి కొంత ఆర్థిక స్థిరత్వం కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు తెలిపారు. అర్హత ఉన్నవారు తమ వివరాలను ప్రత్యేక కౌంటర్లలో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.

# పోలీస్ శాఖలో కీలక కార్యక్రమాలపై డీజీపీ సమీక్ష



- **వచ్చే నెలలో పోలీస్ రిట్రీట్ నిర్వహణ**
- **మహిళా పోలీస్ అధికారుల సదస్సుకు సన్నాహాలు**
- **2 వేల మంది హోంగార్డుల నియామకానికి నోటిఫికేషన్**
- **నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు**

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ పోలీస్ శాఖలో చేపట్టాల్సిన పలు కీలక కార్యక్రమాలు, పరిపాలనా అంశాలపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సమీక్ష నిర్వహించారు. మినీ స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశంలో వివిధ విభాగాలకు సంబంధించిన అంశాలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో సమాలోచనలు జరిపారు. పోలీస్ శాఖను మరింత సమర్థంగా తీర్చిదిద్దడంతో పాటు సిబ్బంది సంక్షేమం, శిక్షణ, సంస్థాగత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. వచ్చే నెలలో నిర్వహించనున్న పోలీస్ రిట్రీట్‌తో పాటు మహిళా పోలీస్ అధికారుల సదస్సు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. పోలీస్ శాఖలో మహిళా అధికారుల పాత్ర, వారి వృత్తిపరమైన అంశాలకు సంబంధించిన సదస్సును సమర్థంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. రాష్ట్ర పోలీస్ శాఖకు సంబంధించిన నూతన మాన్యువల్ రూపకల్పనను పూర్తి చేసి విడుదల చేయడం, పోలీస్ బ్రాస్ బ్యాండ్స్, పైప్ బ్యాండ్స్‌ను పునరుద్ధరించే అంశాలపైనా సమీక్షించారు. రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నిర్వహణతో పాటు ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లపైనా డీజీపీ చర్చించారు. పోలీస్ సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర వార్షిక శిక్షణ క్యాలెండర్‌ను రూపొందించాలని నిర్ణయించారు. శిక్షణ కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా సాగేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. శాఖలో నిర్వహించే పోటీలు, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఇక రాష్ట్రంలో 2,000 మంది హోంగార్డుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసే అంశంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో మంజూరైన సిబ్బంది సంఖ్యను పునఃసమీక్షించి ఖరారు చేయాలని డీజీపీ సూచించారు.

పోలీస్ విభాగాల్లో సిబ్బంది అవసరాలు, విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు బాధ్యతలు అప్పగించారు. పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపైనా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. పదవీ విరమణ అనంతరం వారికి అవసరమైన సహకారం, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనపై అధికారులు దృష్టి సారించాలని డీజీపీ సూచించారు. సమావేశంలో చర్చించిన ప్రతి అంశానికి సంబంధించి సంబంధిత అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించడంతో పాటు, అన్ని పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# ప్రగతినగర్ అంబీర్ చెరువుకు మహర్దశ

- **రూ.కోట్లతో పర్యావరణహితంగా అభివృద్ధికి శ్రీకారం**
- **భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన హైడ్రా కమిషనర్**
- **162 ఎకరాల చెరువును 135.8 ఎకరాలకు విస్తరణ**

**హైదరాబాద్, నవంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువును పర్యాటక, పర్యావరణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. చెరువులో పేరుకుపోయిన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంతో పాటు ఆక్రమణలను తొలగించి సహజ లక్షణాలను పునరుద్ధరించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిసి శుక్రవారం చెరువు పునరుద్ధరణ పనులకు భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు చెరువు సమీపంలో జమ్మిచెట్టును నాటి పనులు ప్రారంభించారు. అంబీర్ చెరువు వాస్తవ విస్తీర్ణం 162 ఎకరాలు కాగా, ప్రస్తుతం ఆక్రమణలు, ఇతర కారణాలతో 121.2 ఎకరాలకే పరిమితమైందని రంగనాథ్ తెలిపారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని ఆక్రమణలను తొలగించడం ద్వారా చెరువు విస్తీర్ణాన్ని 135.8 ఎకరాలకు పెంచనున్నట్లు చెప్పారు. చెరువు చుట్టూ కట్టను నిర్మించి వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల ఆటస్థలాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. సందర్శకులు సేదతీరేందుకు కూర్చునే ప్రదేశాలు, గజీబోలు నిర్మించడంతో పాటు చెరువు మధ్యలోని కొండల సమీపంలో సాహస క్రీడలకు అవకాశం కల్పిస్తామని వివరించారు. బోటింగ్ జెట్టీలు ఏర్పాటు చేసి బోటు షికారుతో పాటు వాటర్ స్పోర్ట్స్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు హైడ్రా కమిషనర్ తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ కంకారియా సరస్సు తరహాలో ప్రగతినగర్ అంబీర్ చెరువు ఫెస్టివల్ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. చెరువును కేవలం నీటి వనరుగా కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఈ పనుల ద్వారా చెరువు పరిసర ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు.వర్షాకాలంలో వరద ముప్పును తగ్గించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు అనుకూలంగా చెరువును అభివృద్ధి చేయనున్నట్లు రంగనాథ్ వివరించారు. సుమారు 10.23 చదరపు కిలోమీటర్ల పరిధి నుంచి వచ్చే వరద నీటిని చెరువులోకి మళ్లించేందుకు ఆరు ఇన్‌లెట్లను అభివృద్ధి చేయనున్నారు. చెరువులో నాలుగైదు మీటర్ల మేర పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి దుర్వాసన సమస్యను పరిష్కరిస్తామన్నారు. చెరువు మధ్యలో ఉన్న రహదారిని విస్తరించడంతో పాటు ప్రజలు సురక్షితంగా రోడ్డు దాటేందుకు స్కైవాక్ వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పనులను ఒకవైపు పూర్తి చేసిన తర్వాత మరోవైపు చేపట్టి చెరువులోని నీటిని పూర్తిగా తొలగించకుండా పునరుద్ధరణ కొనసాగిస్తామని తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in